# 15. మూర్తినాయనారు

మంచి గంధము (చందనము)తో శివలింగమంతటనలది పూజించుట విశేష శివపూజగా పరిగణిస్తారు. మూర్తినాయనారు శివునికి అంతా చందనమలది అనుదినము అర్చించేవాడు. పాండ్య రాజధాని మధురలో ఈయన జన్మించాడు. కులమునకు వైశ్యుడు. అత్యంత పరమ శివభక్తుడు. చందనార్చన నిష్ఠగా పెట్టుకొన్నాడు.

ఒకరోజున కర్ణాటక రాజు మధురపై దండెత్తి పాండ్యరాజును ఓడించి పాండ్య రాజ్యమునకు రాజయ్యాడు. ఆ రాజు జైన మతస్థుడు. శైవ మతాన్ని దేశాన్నుండి తుడిచి వేయాలని సంకల్పించి శైవులను హింసించుట మొదలుపెట్టాడు. అందరిని జైనమతము స్వీకరించమని ఆదేశించాడు. మూర్తినాయనారును గూడ బాగా హింసించాడు. కాని నాయనారు శైవమతమును వీడలేదు. మొక్కవోని ధైర్యముతో నిలబడి రోజూ చందనముతో శివార్చన చేసేవాడు.

ఇతనిని బలవంతంగానైనా జైన మతంలో కల్పుకుందామని, పూరిలో మూర్తినాయనారుకు చందనమమ్మకుండ కట్టడి చేశాడు.ఈ అస్తవ్యస్త పరిస్థితి అశనిపాతమైంది. "దయాసాగరా! ఈ రాజ్యాన్ని ఒక కర్కోటకుడు పరిపాలిస్తున్నాడు. నీ భక్తులను జీవించనీకుండ చేస్తున్నాడు. మాకు శివభక్తుడైన రాజును ఎప్పడు అనుగ్రహిస్తావు? అందరూ రాజునే అనుసరిస్తారు. అందుకని శివభక్తుడైన రాజునే మాకనుగ్రహించు" మని నాయనారు ఎలుగెత్తి ప్రార్థించాడు.

రోజంతా చందనమెచ్చటనైనా దొరకునేమోనని గాలించాడు. ఎవరూ అతనికి చందనము అమ్మలేదు. భగ్న హృదయుడై దేవాలయమునకు వెళ్లాడు. ఒక వినూత్నమైన ఆలోచన వచ్చింది. చందనం బదులు తన చేతులనే సానమీద అరుగదీయసాగాడు. కొంతసేపటికి ఎముకలు బయటపడి కొంతవరకు అరిగిపోయాయి. రక్తము ఆలయమంతా క్రమ్మింది. శివుడు అతని అచంచలమైన నిష్ఠకు చలించి పోయాడు. ఒక దివ్య వాణి వినిపించింది. "మహాత్మా మీనిరతిశయ భక్తికి చాల సంతోషించాను. నీ సాహసము చాలును ఆపెయి. నీ బెడదలు అన్నీ తొలగిపోతాయి. నువ్వే రాజువు అవుతావు.

న్యాయంగా వైదుష్యంతో చాలాకాలము రాజ్యముచేయి. శైవమత ముద్ధరింపు. తర్వాత నా సన్నిధికి రమ్ము” అని వినిపించింది.

నాయనారుకు ఆశ్చర్యము వేసింది. తన చేతులు యథాస్థితికి వచ్చాయి. మూర్తి నాయనారు తాను రాజు కావాలని కోరుకోలేదు. దైవ సంకల్పము అతను రాజు కావాలని. ఆ రాత్రి ఆ కర్కోటక రాజు మరణించాడు. ఆచారము ప్రకారము మరునాడు మంత్రులందరు పట్టపుటేనుగునకు పూలమాల ఇచ్చి వూళ్లో తిప్పారు. ఆ ఏనుగు ఎవరిమెడలో ఆ పూలమాల వేస్తే అతను రాజవుతాడు. ఆ ఏనుగు దేవాలయము సమీపించింది. మూర్తి నాయనారు అప్పడే దేవుని అర్చించుటకు అచ్చటకు వచ్చాడు. ఏనుగు నాయనారుకు ఎదురేగి తన మోకాళ్లపై నుంచుకొని మూర్తినాయనారు మెడలో ఆ పూలమాలను వేసి, నాయనారును తనపై నెక్కించుకొని రాజప్రసాదానికి ఆయనను తెచ్చింది.

మంత్రులు నాయనారును రాజువుకమ్మని అర్థించారు. నాయనారు ఒక షరతుతో అంగీకరిస్తానన్నాడు. “ముందు మీరు శైవ మతస్థులు కండు. నాకు విభూతియే పట్టాభిషేకమునకు సామగ్రి, రుద్రాక్షలే ఆభరణములు, జటాజూటమే కిరీటము” అందరూ దానికి అంగీకరించారు. నాయనారు రాజయి బ్రదికి యున్నంత కాలము న్యాయంగా వైదుష్యంతో పరిపాలించాడు. శైవమతము వృద్ధికావించాడు. అనేక ధర్మకార్యములనాచరించి అంత్యమున శివసాయుజ్యమును పొందినాడు.

****